సాక్షి నిజామాబాద్

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ఒకే బడిలో టీచర్లుగా..

తండ్రీకొడుకులు ఇద్దరూ ప్రభుత్వ టీచర్లే.. నాడు తండ్రి పనిచేసిన పాఠశాలలోనే నేడు తనయుడు విద్యాబోధన చేస్తున్నాడు.

- 8లో ▸



బందోబస్తు పర్యవేక్షణ

రంజాన్ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలను సీపీ పి.సాయి చైతన్య నందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం **41.0 /21.4**

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గవచ్చు. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఘనంగా రంజాన్



నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న కచియా మసీదులో ఉదయం 8 నుంచి, జామా మసీదులో 8.30 గంటల నుంచి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లింలు పేదలకు దుస్తులు, బియ్యం దానం చేశారు. – నిజామాబాద్ రూరల్



ఖిల్లా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, మైనార్టీ కమిషన్ చైర్మన్ అన్సారీ తదితరులు

న్యూస్‌రీల్

బీసీ బిల్లును ఆమోదించాలి



నిజామాబాద్ నాగారం: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, తెలంగాణలో బీసీ రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 2న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన 'బీసీల పోరుగర్జన'లో పాల్గొనేందుకు జిల్లా కేంద్రం నుంచి నాయకులు సోమవారం తరలివెళ్లారు. బస్సును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రఘువీర్ సింగ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా, నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, చంద్రకాంత్, సిరివేణు సంతోష్, వాల్మీకి నరేశ్, మురళి, అజయ్, వాసంజయ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోచింగ్



నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, నగరంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఉచిత తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పేర్లను ఏబీవీపీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నగర కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్, దుర్గాదాస్, రంజిత, వినోద్, ఇంద్రసేన, జయేంద్రవర్ధన్ అలంకార్, తేజ పాల్గొన్నారు.

పెరిగిన టోల్ చార్జీలు

- నేటి నుంచి అమలులోకి

ఇందల్వాయి: టోల్‌ప్లాజా చార్జీలు ఎప్పటిలాగే ఈ ఏడాది సైతం పెరిగాయి. గతంతో పోలిస్తే 3.5శాతం చార్జీలు పెరిగాయని, మంగళవారం నుంచి అమలులోకి వస్తాయని ఇందల్వాయి టోల్‌ప్లాజా మేనేజర్ చలపతిరావు తెలిపారు. కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.90, రిటర్న్ జర్నీ (24 గంటలలోపు)కి రూ. 135, మంత్లీ పాస్ (50 సింగిల్ జర్నీలు)కు రూ. 3035, టోల్‌ప్లాజాకు 20 కి.మీ పరిధిలో ఉండి రిజిస్టర్ చేసుకున్న వాహనాలకు మంత్లీ పాస్ చార్జీలు రూ.350కి పెరిగాయి.

- లైట్ కమర్షియల్ వాహనాలు, లైట్ గూడ్స్ వాహనాలు, మినీ బస్‌లకు సింగిల్ జర్నీకి రూ. 145, రిటర్న్ జర్నీ(24 గంటల లోపు)కి రూ. 220, మంత్లీ పాస్ రూ. 4905కి పెరిగాయి.
- బస్‌లు, ట్రక్‌లకు (రెండు ఎక్సెల్) సింగిల్ జర్నీకి రూ. 310, రిటర్న్ జర్నీకి(24 గంటలలోపు) రూ.465, మంత్లీ పాస్ చార్జీ రూ.10,280కు పెరిగాయి.
- హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనాలు, ఎర్త్ మూవింగ్ వాహనాలు, మల్టీపుల్ ఎక్సెల్ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.485, రిటర్న్ జర్నీకి(24 గంటలలోపు) రూ.725, మంత్లీ పాస్ రూ.16,120కు పెరిగాయి.
- ఏడు ఎక్సెల్‌లు కలిగి ఉన్న భారీ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ. 590, రిటర్న్ జర్నీకి(24 గంటల లోపు) రూ.885, మంత్లీపాస్ చార్జీ రూ.19,625కు పెరిగాయి.

చేసిన తప్పు ఊరకే పోదు

- కలకలం రేపిన అదనపు కలెక్టర్, ఇద్దరు ఉన్నతాధికారులపై కేసు
- ధాన్యం ఒకరికి ఇచ్చి.. సీఎంఆర్ మరొకరిని అడిగిన వైనం
- దుబాయ్‌కు చెక్కేసిన మాజీ ఎమ్మెల్యే షకీల్



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు ప్రజలకు సేవ చేయడంతో పాటు ప్రజల ఆస్తులను రక్షించడం, బాధితులకు న్యాయం చేసేందుకు పనిచేయాలి. అయితే ఇందుకు విరుద్ధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో అధికారులు తగిన ఫలితం చవి చూడాల్సి వస్తోంది. బాధితుడి పోరాటంతో కోర్టు ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారితో పాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులపై కేసు నమోదైంది. తప్పుడు మార్గంలో వెళ్లేందుకు అధికారులను ప్రోత్సహించిన మాజీ ఎమ్మెల్యే షకీల్ మాత్రం దుబాయ్ వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్ రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. 2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిషోర్ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు ఉన్నతాధికారులు చూపించారు. మరింత ముందుకెళ్లి సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసేలా కథ నడిపించారు. కథ ఇంతటితో ఆగలేదు. ధాన్యం షకీల్ మిల్లుకు పంపించి, కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను కిషోర్‌కు చెందిన శ్రీనివాస రైస్ మిల్లు నుంచి ఇవ్వాలని ఒత్తిడి తేవడం గమనార్హం. ఈ విషయమై కిషోర్ నెలల తరబడి పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు కోర్టు ఆదేశాలతో ఉన్నతాధికారులపై కేసు నమోదైంది.

అధికారంలో ఉన్న సమయంలో..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కోట్లాది రూపాయల విలువజేసే ధాన్యాన్ని ప్రభుత్వం వద్ద తీసుకుని ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారీతిన దందా చేశాడు. మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిషోర్ మిల్లు నుంచి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించాడు. అయితే అధికారం పోవడంతో షకీల్ తక్షణమే దుబాయ్ వెళ్లిపోయాడు. జిల్లాలో మొత్తం 41 మంది మిల్లర్లను ప్రభుత్వం డిఫాల్టర్లుగా ప్రకటించింది. ఈ మిల్లర్లు రూ.417 కోట్ల విలువ చేసే కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇందులో ఒక్క షకీల్ నుంచి రావాల్సిన బియ్యం విలువే రూ.60 కోట్ల మేర ఉండడం విశేషం.

- 2021-22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకు గాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబయి, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. ఓ 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో పాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు. మరోవైపు కిషోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసే కథ నడిపిన అధికారులే సీఎంఆర్ కిషోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తూ రావడం విశేషం. ఈ విషయంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని షకీల్ దండుకున్న ధాన్యం డబ్బులను రికవరీ చేసేందుకు కృషి చేస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే అదనపు కలెక్టర్, మాజీ డీసీవో, డీటీలపై కేసులు నమోదయ్యాయి.

రాజీవ్ యువవికాసంపై దృష్టి సారించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

- యువతకు విస్తృతంగా అవగాహన కల్పించండి
- అమలుతీరును నిశితంగా పర్యవేక్షించాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

నిజామాబాద్‌అర్బన్: రాజీవ్ యువవికాసంపై ప్రత్యేక దృష్టి సారించి యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పథకం అమలు తీరును నిశితంగా పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాజీవ్ యువవికాసంపై వీడియాకాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ సీఎం సోమవారం సాయంత్రం సమీక్షించారు. వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని, దీంతో నిరుద్యోగ యువతకు వారు ఎంపిక చేసుకునే రంగాల్లో స్వయం ఉపాధి పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నిరుద్యోగ యువత స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. గతంలో స్వయం ఉపాధి పథకాల కింద వచ్చిన దరఖాస్తుల్లో మొక్కుబడిగా కేవలం 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే మంజూరీలు, యూనిట్ల గ్రౌండింగ్ జరిగిందన్నారు.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. రాజీవ్ యువవికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా ప్రకటనలు జారీ చేయడంతోపాటు విస్తృత ప్రచారం చేశామన్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటవెంటనే జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించామన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పథకం ప్రాధాన్యతను, అమలు తీరుపై మార్గనిర్దేశం చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఆయా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ అంకిత్, నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, డీబీసీడీవో స్రవంతి, డీటీడబ్ల్యూవో నాగూరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 66 శాతం పన్ను వసూలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 66శాతం పన్ను వసూలు చేశారు. మొత్తం రూ.89.41 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.41.40 కోట్లు వసూలైనట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. పన్ను వసూళ్ల కోసం కమిషనర్ పర్యవేక్షణలో ఐదు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశారు. సెలవు రోజులు, ఆదివారాల్లో సైతం సిబ్బంది పన్ను వసూలు చేశారు. బల్దియా కార్యాలయంలోని అన్ని విభాగాల సిబ్బందిని రెవెన్యూ వసూళ్లకు వినియోగించారు. రెవెన్యూ వసూళ్లకు సహకరించిన సిబ్బందికి కమిషనర్ దిలీప్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

శ్రీరామా.. ఇవేం లెక్కలు!

- ఎస్సారెస్పీ నీటి విడుదల, నిలువల్లో వ్యత్యాసం
- చివరి లెక్కలు సరిచేసేందుకేనంటూ ఆరోపణలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలపై అధికారులు చెబుతున్న లెక్కలు గజిబిజిగా ఉంటున్నాయి. కాలువల్లో నీటి ప్రవాహం ఒకేలా ఉన్నప్పటికీ ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గింపు లెక్కలు తేడా కొడుతున్నాయి. కాలువలు, లిఫ్టులు, తాగు నీటి కోసం మొత్తం ప్రాజెక్టు నుంచి 8372 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అయితే, ప్రాజెక్టులో నీటిమట్టం మాత్రం ఒక రోజు 0.5 టీఎంసీలు, మరో రోజు 0.24 తగ్గినట్లు చూపుతున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రాజెక్ట్ నుంచి 33 వేల క్యూసెక్కుల నీరు విడుదల అయినా, ఒక్క టీఎంసీ కూడా తగ్గినట్లు రికార్డుల్లో చూపకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. చివరి లెక్కలు సరి చేసేందుకే అధికారులు ఇలా చేస్తుంటారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ప్రాజెక్టు ఈఈ చక్రపాణిని 'సాక్షి' వివరణ కోరగా వివరాలు తెలుసుకుంటానని సమాధానం ఇచ్చారు.



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

కాకతీయ కాలువ నీటి ప్రవహంపై..

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల, నీటి ప్రవాహంపై ఆది నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ కాలువ పూర్తి సామర్థ్యం 9 వేల క్యూసెక్కులు, ఆ ప్రవాహ సూచిక కోసం కాలువ వద్ద సూచిక బోర్డులో 15 పాయింట్లు వేశారు. ప్రస్తుతం ఆ బోర్డులో 13 పాయింట్ల వరకు నీటి విడుదల జరుగుతోంది. అయినా కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోందంటూ ప్రాజెక్ట్ అధికారులు లెక్కల్లో చూపుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా విడుదలయ్యే నీటిని విద్యుదుత్పత్తి కోసం జెన్‌కో గేట్ల గుండా సరఫరా చేస్తారు. లెక్కల్లో వ్యత్యాసం ఏమిటని అడిగితే జెన్‌కో అధికారులే ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారంటూ సెలవివ్వడం గమనార్హం.

నీటి విడుదల.. నిల్వ క్యూసెక్కుల్లో..

తేది	నీటి విడుదల	ఇన్‌ఫ్లో	నీటి నిల్వ	నీటి తగ్గింపు
26.03.25	8397	1447	18.833	0.704
27.03.25	8372	1447	18.131	0.702
28.03.25	8372	1447	17.557	0.574
29.03.25	8250	1447	17.347	0.210
30.03.25	8250	0	17.103	0.244
31.03.25	8235	0	16.544	0.557



సహజ వ్యవసాయం చేయాలి

- రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- ఉద్యానవనశాఖ మాజీ సంచాలకులు వెంకటరామిరెడ్డి
- సేంద్రియ, సహజ వ్యవసాయంపై రైతులకు ఒక రోజు శిక్షణ



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ మాజీ సంచాలకులు వెంకట్రామిరెడ్డి

నిజామాబాద్‌అర్బన్: రైతులు క్రమక్రమంగా సేంద్రియ, సహజ వ్యవసాయం చేయాలని ఉద్యానవన శాఖ మాజీ సంచాలకులు వెంకట్రామిరెడ్డి అన్నారు. రాష్ట్ర ఉద్యానవనశాఖ సమన్వయంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని సేంద్రియ, సహజ వ్యవసాయ ప్రాంతీయ కేంద్రం(నాగ్‌పూర్) కలెక్టరేట్‌లో సోమవారం ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇంత మంచి శిక్షణకు నిజామాబాద్‌వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన రైతులు సహజ వ్యవసాయాన్ని అవలంబించాలన్నారు. త్వరలో ఏర్పాటయ్యే జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో)లో రైతులు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. జిల్లా రైతులను ఆరోగ్యంగా, ఆర్థికంగా అభివృద్ధి పర్చాలన్నారు.

సేంద్రియ, సహజ వ్యవసాయం చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, లాభాలను ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ప్రవీణ్ వివరించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే పంటల నమోదు ధ్రువీకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం విశిష్టత, సాధకబాధకాలను వివరించారు. త్వరలోనే జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నియోజకవర్గ రైతులతో నిజామాబాద్ జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి రైతులకు మార్కెట్ డైరెక్ట్ లింకేజీ విధానంలో పంట దిగుబడులు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్, శాఖ అధికారులు సాయిబాబా, నర్సయ్య, రోహిత్, వినాయక్, జిల్లాలోని ఎఫ్‌పీవోల డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎంతో మందికి అవగాహన కల్పించాం



పాలేకర్ విధానం అమలు చేస్తున్నాం. సేంద్రియ వ్యవసాయంపై ఇప్పటివరకు ఎంతోమందికి అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాల విద్యార్థులు, సైంటిస్టులు, రైతులకు సేంద్రియ విధానాన్ని వివరించడంతోపాటు శిక్షణ, అవగాహన కల్పించాం. ఆర్గానిక్ పద్ధతిలోని కంది పంటను పండించడం, పసుపు ఉడకబెట్టకుండ ముక్క లు చేసి దాన్ని వినియోగించడం. ఆర్గానిక్ పంటలతో చేకూరే లాభాలను తెలియజేస్తున్నాం. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ఆర్గానిక్ ఫుడ్ వినియోగం పెంచాలి. అప్పుడే ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండగలుగుతాం.
– పాపారావు, రైతు, పాలేకర్ విధానం

అవార్డులు సాధించాం



ఆర్గానిక్ ఫుడ్‌పై 2014 నుంచి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. జపాన్ పద్ధతిలో వరి సాగు చేశాం. అధిక దిగుబడిలను ఎలా సాధించాలనేదానిపై అనేక కార్యక్రమాలు నిర్వహించాం. మాకు ఎన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలు లభించాయి. 2018 రసం పీల్చే పురుగు రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ఇబ్బంది పెట్టింది. అధికారులు ఏం చేయలేకపోయారు. కానీ మేము మాత్రం కంట్రోల్ చేశాం. ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఆర్గానిక్ ఫుడ్‌ను వినియోగించాలి. దీనిపై జిల్లా వ్యాప్తంగా అధికారులు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. – జనార్దన్‌రావు, రైతు

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి: మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అనూష తెలిపారు. గణితం, బోటనీ, జువాలజీ , కెమిస్ట్రీ, కామర్స్, పొలిటికల్ సైన్స్ బోధించేందుకు మహిళా లెక్చరర్లు కావాలని పేర్కొన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తామని తెలిపారు. ఇది పూర్తి తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకమని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 2న(బుధవారం) ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ, డెమో కోసం కళాశాలకు రావాలని తెలిపారు.

తల్లిని కోల్పోయిన చిన్నారికి చేయూత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఇటీవల తల్లిని కోల్పోయిన చిన్నారికి కోనేరు ట్రస్టు అండగా నిలుస్తుందని బీజేపీ నాయకులు తెలిపారు. మండలానికి చెందిన మానస చికిత్స పొందుతూ ఇటీవల మరణించింది. ఆమెకు 15 రోజుల చిన్నారి ఉంది. ఈ విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ సోమవారం బాధిత కుటుంబానికి ప్రాథమికంగా రూ. 5వేలు ఆర్థిక సహాయం పంపించారు. చిన్నారికి ప్రతి ఏడాది ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కోటగిరి, రుద్రూర్ మండలాల బీజేపీ అధ్యక్షులు ఏముల నవీన్, అలపాటి హరికృష్ణ, మాజీ వార్డు సభ్యుడు మామిడి శ్రీనివాస్, ఏముల కాశీరాం, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పదాధికారుల సమావేశంలో జిల్లా నేతలు



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన పదాధికారుల సమావేశానికి జిల్లా నేతలు హాజరయ్యారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నారై.. మనసున్న 'శ్రీమంతుడు'

- అమెరికాలో వ్యాపారవేత్తగా స్థిరపడిన ధర్మోరా వాసి
- సొంతూరులో విద్య, వైద్యానికి చేయూతనందిస్తున్న అనూప్‌రెడ్డి

కష్టపడి సంపాదించాలి.. సంపాదించిన దానిలో వీలైనంత ప్రజలకు పంచాలి. ప్రపంచంలో మంచి జరగడానికి తనవంతు సాయంగా నిలవాలంటున్నాడీ ప్రవాస భారతీయుడు. తన కుటుంబం బాగుంటే చాలు.. పక్కవాడికి ఏమైతే ఏంటీ అనుకుంటున్న ప్రస్తుత సమాజంలో.. సహాయానికి మారుపేరుగా నిలుస్తున్నాడు ముస్కు అనూప్‌రెడ్డి.



ధర్మోరాలోని ప్రాథమిక పాఠశాల భవనం



ధర్మోరాలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయం

మోర్తాడ్: గ్రామంలో ఎవరికైనా ఆపదొస్తే.. ముందు తలచేది ఆయన పేరే. సాయం కోరి వచ్చిన వారికి కాదనకుండా నేనున్నానంటూ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం ధర్మోరాకు చెందిన ముస్కు అనూప్‌రెడ్డి అమెరికాలో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. తాను పుట్టి, పెరిగిన గ్రామానికి విద్య, వైద్యానికి చేయూతనందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

మెరుగైన విద్య కోసం..

ధర్మోరా గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువ, ఉపాధ్యాయుల పోస్టులు తక్కువగా ఉండడంతో వీడీసీ ఆధ్వర్యంలో విద్యావలంటీర్లను నియమించాల్సి వచ్చింది. కమిటీ వద్ద నిధుల కొరత ఉండడంతో ఈ విషయాన్ని అనూప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పిల్లలకు మెరుగైన విద్యనందించాలనే ఉద్దేశంతో క్షణం ఆలోచించకుండానే విద్యావలంటీర్ల వేతనాలు అందించేందుకు ముందుకొచ్చారు. అలా ఐదేళ్ల నుంచి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించి వారికి ప్రతి నెలా రూ.16వేల వేతనాన్ని సొంతంగా సమకూరుస్తున్నారు. ఉన్నత పాఠశాలకు చెందిన అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోగా, అనూప్‌రెడ్డి రూ.12లక్షలు సమకూర్చారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి గదుల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రి బిల్లులు చెల్లించలేని దయనీయ స్థితిలో ఉండే పేదలకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. ఆస్పత్రి బిల్లులను చెల్లిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. వందలాది కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం లక్షల రూపాయాలు సాయం అందించి అందరి మనసులో నిలిచారు.

ధార్మిక సేవలో..

కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి అంటే అందరికీ భక్తి. గ్రామస్తులకు అందుబాటులో ఉండేలా రూ.1.50 కోట్లతో ధర్మోరాలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్వహణ, పురోహితుని జీత భత్యాల కోసం ప్రత్యేకంగా నిధిని సైతం సమకూర్చారు. 20 ఏళ్లుగా అమెరికాలో వ్యాపారం చేస్తూ స్థిరపడిన అనూప్‌రెడ్డి పుట్టి పెరిగిన ఊరికి, ఆపదలో ఉండే వారికి కొండంత అండగా నిలుస్తూ స్ఫూర్తిమంతుడిగా నిలుస్తున్నారు.

మా కుటుంబానికి అండగా..

నా భర్త అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అనూప్‌రెడ్డి సార్ ఆర్థికంగా భరోసా ఇచ్చి అండగా నిలిచారు. నాకు తెలిసిన వారి ద్వారా నా పరిస్థితిని ఆయనకు వివరించాను. పెద్ద మనసుతో వైద్య ఖర్చులను ఆయనే భరించారు. సాయం కోరి వచ్చిన వారికి ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు.

– షిండే సోనా, నిజామాబాద్

అనూప్‌రెడ్డి సేవలు మరిచిపోలేం

మా గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు అనూప్‌రెడ్డి చేస్తున్న మంచి పనులు మరిచిపోలేం. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ గ్రామంలో వైద్య, విద్యా సేవలను అందిస్తున్నారు. కొత్తగా గుడిని నిర్మించి కలియుగ దైవాన్ని కనుల ముందుంచారు.

– గ్రామాభివృద్ధి కమిటీ, ధర్మోరా

సేవలోనే ఎంతో తృప్తి



వ్యాపారం, సంపాదన ఇవేవీ నాకు తృప్తిని అందించలేవు. సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయి. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది. సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాం.

– ముస్కు అనూప్‌రెడ్డి, ధర్మోరా(అమెరికా)

ఉపాధ్యాయుడిగా నాడు తండ్రి.. నేడు కొడుకు

ఒకే పాఠశాలలో విద్యాబోధన..



బాలయ్య (ఫైల్)

మాచారెడ్డి: తండ్రీకొడుకులు ఒకే పాఠశాలలో విద్యా బోధన చేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. రాజన్న–సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన వేషాల బాలయ్య లచ్చపేట ఉన్నత పాఠశాలలో 1993–1995వరకు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆయన పని చేసిన సమయంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దాడు. తదుపరి బాలయ్య అనారోగ్యానికి గురికావడంతో బాలయ్య కుమారుడు శ్రీనివాస్ విద్యావలంటీర్‌గా ఇదే పాఠశాలలో 1995–1996 వరకు పనిచేశాడు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి గంభీరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. 2023 నవంబర్‌లో డిప్యుటేషన్‌పై వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించాడు. 2024 అక్టోబర్‌లో రెగ్యులర్ ఉపాధ్యాయుడిగా ఇదే పాఠశాలకు బదిలీపై వచ్చాడు. అప్పటి నుంచి ఇదే పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. నాడు తండ్రి, నేడు తనయుడు ఒకే పాఠశాలలో పనిచేయడం ఆసక్తికర విశేషం.



లచ్చపేట ఉన్నత పాఠశాల

ఆనందగా ఉంది



మా నాన్న పనిచేసిన పాఠశాలలో నేను ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. మానాన్న చదువు చెప్పిన నాటి విద్యార్థుల కుమారులకు, కుమార్తెలకు నేను విద్యాబోధన చేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది.

– శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, లచ్చాపేట

త్రిభువన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ రెడ్డి

బోధన్: లోక్‌సభలో త్రిభువన్ సహకార విశ్వ విద్యాలయం బిల్లు–2025 ఆమోదం పొందడం చరిత్రాత్మక ముందడుగని క్రిబ్ కో(క్రిషక్ భారతి కో–ఆపరేటివ్ లిమిటెడ్) జిల్లా మేనేజర్ సీహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. సాలూర మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా గుజరాత్‌లోని ఐఆర్ఎంఏ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్) సంస్థ త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయంగా మారనున్నట్లు తెలిపారు. ఇది తొలి జాతీయ సహకార విశ్వవిద్యాలయంగా ఆవిర్భావించనున్నదని పేర్కొన్నారు. సహకార రంగానికి నైపుణ్యం కలిగిన నిపుణులను తయారు చేసి అందించడమే ఈ విశ్వవిద్యాలయ లక్ష్యమని వివరించారు. సహకార మార్కెటింగ్, గ్రామీణ క్రెడిట్, పాడి, మత్స్య పరిశ్రమలపై డిగ్రీ, డిప్లొమాలు, శిక్షణ, పరిశోధనలు అందిస్తుందని తెలిపారు.

'విద్యార్థులపై దాడి సిగ్గుచేటు'



మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ

తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడు బీ శివ తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతిష్టాత్మక హెచ్‌సీయూకి సంబంధించిన 400ల ఎకరాల భూమిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. రాత్రివేళలో వర్సిటీ భూములను పొక్లెయినర్లతో చదును చేసే ప్రయత్నంపై ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపగా, ప్రభుత్వం పోలీసుల ద్వారా వారిపై లాఠీచార్జి చేయించడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులపై దాడులు చేయించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షులు తరుణ్, సమీర్, రాము, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తును పర్యవేక్షించిన సీపీ

ఖలీల్‌వాడి: రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాలను సీపీ పి.సాయి చైతన్య సందర్శించారు. శాంతినగర్ ఈద్గా, కచ్చియా మసీద్, శంభుడిగుడి పరిసర ప్రాంతాల్లో బందోబస్తును పర్యవేక్షించారు. సీపీ వెంట అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



● ఈద్ ముబారక్

జిల్లా వ్యాప్తంగా సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బోధన్ రోడ్, ఖిల్లా రోడ్ తదితర ప్రాంతాలన్నీ జనసందోహమయ్యాయి. ప్రార్థనలు ముగించుకొని వస్తున్న ముస్లిములకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, నాయకులు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



నగరంలోని ఖిల్లా ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బల్దియాలో ఉన్నత పోస్టులు ఖాళీ

- రిటైర్ అయిన డీసీ, డిప్యూటీ సీపీవో



రాజేంద్రకుమార్



శ్యాంకుమార్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగర పాలక సంస్థలో కీలకమైన రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గంగిశెట్టి రాజేంద్ర కుమార్, డిప్యూటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్ పదవీ విరమణ పొందారు. రాజేంద్ర కుమార్ సంవత్సరానికి పైగా రెవెన్యూ విభాగంతో పాటు శానిటేషన్ విభాగాలను పర్యవేక్షిస్తుండగా, శ్యామ్‌కుమార్ డీసీపీవోతోపాటు నుడా విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. బల్దియాలో ప్రధానమైన పోస్టుల్లో ఉన్న ఇద్దరు రిటైర్డ్ కాగా, వారి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అడిషనల్ కమిషనర్ ఎస్ శంకర్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలోనూ ఎవరూ బాధ్యతలు తీసుకోలేదు. పదవీ విరమణ, బదిలీలతో బల్దియాలో చాలా పోస్టులు ఖాళీ కాగా, పాలన భారంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పరిధి గౌతంనగర్‌కు చెందిన రంగాల కనకయ్య(48) అదృశ్యమైనట్లు భార్య లక్ష్మి ఆదివారం తెలిపారు. మార్చి 25న ఇంటి నుంచి వెళ్లిన కనకయ్య తిరిగి రాలేదని, చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. మార్చి 27న మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

ఎడపల్లి(బోధన్): ముందుకెళ్లేందుకు దారివ్వాలని హారన్ కొట్టిన ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వస్తుండగా పోచారం గేటు వద్ద ముందు వెళ్తున్న బైక్ సైడ్ ఇవ్వాలంటూ డ్రైవర్ హారన్ ఇచ్చాడు. దీంతో ఆగ్రహించిన సల్మాన్, ముఖీద్ అనే ఇద్దరు యువకులు బస్సును దూపల్లి గేటు వద్ద బస్సును ఆపి హారన్ ఎందుకు కొట్టావంటూ బూతులు తిడుతూ డ్రైవర్, కండక్టర్లపైకి దాడికి పాల్పడ్డారు. డ్రైవర్ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి ఒకరి మృతి



మహేందర్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మార్చి 30న చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మచ్చ మహేందర్(48) ఉగాది రోజున మామిడి, వేప ఆకుల కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. కాగా, మహేందర్ 31న(సోమవారం) చెరువులో మృతదేహమై కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మహేందర్ ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో చెరువు వద్ద కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మచ్చ రజిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహేందర్ ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి మెడికల్‌లో పనిచేసేవాడని, భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బోధన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెగడపల్లి నుంచి బోధన్ వైపు మార్చి 29న ఉదయం కాలినడక వస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బర్దీపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందాడని, దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన నాగేశ్ (38) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారం రోజుల క్రితం ఇంట్లో గొడవ కావడంతో నాగేశ్ భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పులు ఎక్కువ కావడంతోపాటు మద్యానికి బానిసైన నాగేశ్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన జడల రమేశ్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. రమేశ్ గతంలో తండ్రిని చంపిన కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై దొంగతనాలు చేస్తుండేవాడు.

ఈ క్రమంలో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు రోజుల కిత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రమేశ్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. సోమవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు



నిజామాబాద్ సిటీ: నాగారం శివారులోని మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డులో తరచూ మంటలు చెలరేగుతున్నాయి. యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుచేసే ప్రక్రియ సాగుతుండగా, ఎండ వేడిమికి నిప్పురాజుకుంటోంది. లోపలి నుంచి వస్తున్న వేడి, దానికి తోడు పగటివేళలో వీచే వేడి గాలులతో నిప్పు రాజుకుంటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు, పాలిథిన్ కవర్లు ఇతర వ్యర్థాలకు నిప్పంటుకొని అవిపెద్దగా మారుతున్నాయి. 10 పది రోజుల నుంచి డంపింగ్ యార్డులో నిత్యం మంటలు చెలరేగుతున్నాయి. సిబ్బంది అప్రమత్తమవుతూ ఆర్పివేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మరోసారి మంటలు చెలరేగడంతో డంపింగ్ యార్డు ఇన్‌చార్జి ప్రభురాజ్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

సర్కార్ బడిని బతికించండి



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలో తిరుగుతూ సర్కార్ బడిలో మీ పిల్లలను చదివించి బడిని బతికించండి అంటూ వేడుకున్నారు. సోమ వారం గ్రామంలో వీడీసీ, వివిధ సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలు తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించి బడిని కాపాడుకోవాలని కోరారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎంలు మంత్రి రమేశ్, ఓటర్కర్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కసుతోనే చంపేశారు

- బాలుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో కిడ్నాప్‌కు గురైన బాలుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. చిన్నపిల్లలు ఉండడంతో భిక్షాటనలో తోటి మహిళ తమకంటే ఎక్కువ సంపాదిస్తోందనే అక్కసుతో తల్లీకొడుకులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. సీపీ పోతరాజు సాయి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాబాది బిలోలికి చెందిన కమలాబాయి రంజాన్ నేపథ్యంలో మార్చి 27న భిక్షాటన కోసం ముగ్గురు పిల్లలతో కలిసి నిజామాబాద్‌కు వచ్చింది. ఇద్దరు కూతుళ్లు శివాని, రోజా భిక్షాటన అనంతరం బస్టాండ్‌లో పడుకోగా, కమలాబాయి తన 14 నెలల కొడుకు కైలాశ్‌తో రైల్వే స్టేషన్‌లో నిద్రించారు. తెల్లవారుజామున కైలాశ్ కనిపించకపోవడంతో తల్లి ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మార్చి 28న మూడో టౌన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ పక్కన కైలాశ్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. బాలుడి కిడ్నాప్, హత్య కేసును ఛేదించేందుకు పోలీసు ప్రత్యేక బందాలు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మాలపల్లి మసీద్ వద్ద నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలుకా కేంద్రంలోని సరస్వతి నగర్‌కు చెందిన తల్లీకొడుకులు బోస్లే మాలాబాయి, బోస్లే గోపాల్ అనుమానాస్పదంగా తిరుగుతూ భిక్షాటన చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో కైలాశ్‌ను తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. పిల్లలతో కలిసి కమలాబాయి భిక్షాటనలో ఎక్కువ సంపాదిస్తుందనే అసూయ పెంచుకున్నట్లు తెలిపారు. గతంలో మాలబాయి భర్తను కమలాబాయి హత్య చేసిందనే అనుమానంతోనే కైలాశ్‌ను ఎత్తుకెళ్లి బండరాయితో మోది హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీపీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుళ్లు గంగారాం, రాంబాబు, రవి, అనూష్‌ను సీపీ అభినందించారు.